క్లుప్తంగా

మొబైల్ యాప్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

కంచిలి:ఇప్పటి వరకు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వటి యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న విద్యుత్ వినియోగదారులు ఇక నుంచి ఈస్టర్న్ పవర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని లేదా www.apeasternpower.com వెబ్ సైట్ నుంచి బిల్లులు చెల్లించాలని స్థానిక విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్.గురవయ్య పేర్కొన్నారు. ఈ మేరకు తమ సి.ఎం.డి. పృథ్వీరాజ్ ఇమ్మడి నుంచి ఉత్తర్వులు అందాయని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్ లేదా వెబ్ సైట్‌లోకి వెళ్లి యూపీఐ యాప్‌లు ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం లేదా డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, వాల్లెట్స్, క్యాష్ కార్డ్స్ ద్వారా చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు.

వృద్ధ దంపతులకు సాయం



దంపతులకు సాయాన్ని అందిస్తున్న సేవా సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు తామాడ లక్ష్మణరావు అన్నారు. పొల్లాడ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గోరు సీతమ్మ, సింహాచలంలకు సంస్థ తరఫున రూ. ఏడు వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. సేవా సమితి సభ్యులు చింత మోహనరావు, ఈశ్వరరావు, పాపారావు, మండల నీలయ్య, తాతయ్య, ఊర్వశి, మీనా, మోహిని, రాణి దమయంతి, సౌదామిని ఉన్నారు.

బోరుభద్ర మీదుగా విశాఖకు బస్సు సర్వీసు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి నుంచి సంతబొమ్మాళి మండలం బోరుభద్ర మీదుగా నిమ్మాడ నుంచి విశాఖపట్టణానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును మంగళవారం ప్రారంభించారు. ఇదే గ్రామాలను కలుపుతూ విశాఖపట్టణానికి బస్సు సర్వీసు కోసం ప్రజలు మంత్రి అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సును కేటాయించారు. ఆర్టీసీ సిబ్బంది సమక్షంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.శేషగిరి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈయనతో పాటు డి.ప్రసాద్ రెడ్డి, కె.రామ్‌ప్రసాద్, టీఎస్ఎన్ రమణ, ఆర్.ప్రీతీష్, వెంకట్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, చంద్రరావు, పి.రమణ ఉన్నారు.

వంశధార చానల్‌లో పూడికతీత



పూడికతీత పనులు జరుగుతున్న దృశ్యం

సంతబొమ్మాళి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ అన్నారు. మర్రిపాడు గ్రామంలో వంశధార 12–ఆర్ చానల్‌లో పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో పనులు సరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పొల్లాడ మాజీ సర్పంచ్ రఘు, వంశధార జేఈ భాస్కరరావు పాల్గొన్నారు.

తక్షణమే ఇసుక సరఫరా చేయాలి

టెక్కలి: భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించే దిశగా తక్షణమే ఇసుకను సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇసుక సరఫరా చేయకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశం లేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించే విధంగా క్లైమ్స్ నిధులు కేటాయించాలని, సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలని షణ్ముఖరావుతో పాటు పోలారావు, ఎస్.కృష్ణ, వై.వెంకట్రావు డిమాండ్ చేశారు.

ఎన్నికల విధుల వేతనాల్లో అవకాశం కల్పించాలి

టెక్కలి: ఎన్నికల విధులు చేపట్టిన సిబ్బందికి అదనంగా వేతనాలు ప్రకటించిన నేపథ్యంలో రెవెన్యూ వ్యవస్థలో ఎంతో కీలకంగా పనిచేసిన డ్రైవర్లకు కూడా అవకాశం కల్పించాలని అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో విన్నవించారు. ఎన్నికల సమయాల్లో రేయింబవళ్లు ఎంతో కీలకంగా పనిచేసిన డ్రైవర్లకు అదనంగా వేతనాలు ఇవ్వకపోవడం ఎంతో బాధాకరమని వాపోయారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మిక శోభ



సోంపేట: కాళికాదేవి ఊరేగింపులో భక్తులు

కంచిలి: గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గ్రామదేవతలు, అమ్మవార్ల సంబరాలతో అన్ని వీధులు కళకళలాడాయి. కంచిలి మండలంలోని ఎక్కల గ్రామంలో గ్రామదేవత సింధుపోలమ్మ సంబర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిరూపాలైన గజముద్దలను తలపై మోసుకొని డప్పు వాయిద్యాలతో భక్తులు ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో ఇప్పిలి క్రిష్ణారావు, బుడ్డెపు కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గార పోలమ్మ సంబరాలు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో గార పోలమ్మ సంబర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గజముద్దలను నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. అలాగే పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మేళ తాళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి చల్లదనం

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి చల్లదనమహోత్సవాన్ని భక్తులు నిర్వహించారు. మున్సిపాలిటీలోని ఆరు వార్డులకు చెందిన 13 వీధుల్లో అమ్మవారి చల్లదనం కోసం ప్రత్యేక సంబరాలు చేశారు. సంబరాల్లో భాగంగా మేళతాళాలతో కాళీమాత నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, మర్దనలు, ప్రత్యేక ఆలంకరణతో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పోలమాంబ సంబరం

సోంపేట: జింకిభద్ర గ్రామంలో అసిరిపోలమాంబ చల్లదన ఉత్సవం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ వేతనదారులతో ఘనంగా నిర్వహించారు. కాళీవేష ధారణ, మేళతాళాలతో ఉత్సవాన్ని గ్రామంలో తిరువీధులు నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటకం ఆకట్టుకుంది. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాశీబుగ్గ: మందస మండలం అంబుగాం పంచాయతీ చిన్నబహాడపల్లి గ్రామంలో అమ్మవారి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు చిన్నబ్రాహ్మణవీధిలో పెంటపోలమ్మ అమ్మవారి చల్లదనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: అలరించిన కాళీమాత నృత్యం



కాశీబుగ్గ: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఆహారంలో మిల్లెట్లకు ప్రాధాన్యం



సమీక్ష నిర్వహిస్తున్న ప్రొఫెసర్ వివేకానంద ఝూ తదితరులు

వజ్రపుకొత్తూరు: రోజువారి ఆహారంలో మిల్లెట్లకు ప్రాధాన్యత ఇవ్వాలని జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌కు చెంది నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ వివేకానంద ఝూ అన్నారు. అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తన బృందంతో కలిసి మంగళవారం సందర్శించారు. అనంతరం ఎస్ఐహెచ్ఆర్–జీహెచ్ఆర్సీ కార్యక్రమాల్లో భాగంగా పౌష్టికారం, ఆహారపు అలవాట్లు, వజ్రపుకొత్తూరు మండలంలో కిడ్నీ వాధి తీవ్రతపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు , ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష నిర్వహించి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఇంటింటా తిరిగే వారికి పూర్తి అవగాహన ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. నిత్య జీవితంలో మిల్లెట్స్‌ది కీలక పాత్ర కాబట్టి పోషకాహారంలో భాగంగా చేసుకుని దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.చిన్ని, జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ప్రొగ్రాం మేనేజర్ డాక్టర్ బాలాజీ, మిల్లెట్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ జోసెఫ్, ఫీల్డు కోఆర్డినేటర్ టి.దురోధనరావు పాల్గొన్నారు.

పోలీసులకు వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు



పోలీసుస్టేషన్‌కు వెళ్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు తదితరులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఓ నిరుపేదకు పింఛన్ కోసం పోరాడిన మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుపై చేతులు వేసి నెట్టేసిన విషయంపై వైఎస్సార్‌సీపీ నాయకులు స్పందించారు. మంగళవారం ఉదయం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌కు చేరుకుని దౌర్జన్యం చేసిన వారిపై ఫిర్యాదు చేశారు. వారిపై రౌడీషీట్ తెరిపించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిపక్ష నాయకులకు రక్షణ కల్పించాలని కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుతో పాటు వైస్ చైర్మన్ బోర క్రిష్ణారావు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీనివాసరావు, పిచ్చుకల ఆజయ్‌కుమార్, సవర సోమేశ్వరరావు, కర్రి మాధవరావు, నాయకులు బోనెల రాము, డబ్బీరు నాగు, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావుతో పలువురు నాయకులు ఉన్నారు.

ఓంకార్ మాస్టర్‌కు నివాళులు



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయుడు, ప్రజా కళాకారుడు బత్తిని ఓంకార్ మాస్టర్ మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు. ఓంకార్ మాస్టర్ సంస్మరణ సభను నగరంపల్లి గ్రామంలో ప్రజా సంఘ నాయకుడు టి.భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై ఓంకార్ మాస్టర్ అనేక పోరాటాలు చేశారని, ఉపాధ్యాయ వృత్తిలో చేరిన తర్వాత యూటీఎఫ్ నాయకుడిగా ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ప్రజా సంఘాల నాయకులు బమ్మిడి అనందరావు, నెయ్యిల మోహన్, ఎన్.బైరాగి, చంద్రయ్య, మనోజ్, బి.సుగుణ, సింహాచలం, లక్ష్మి ఉన్నారు.

రిటైర్డు వీఆర్వోకు సన్మానం



రవి, సుధ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు: ఉద్యోగ జీవితంలో బాధ్యతాయుతంగా మెలిగిన వారినే ప్రజలు గౌరవిస్తారని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పాతటెక్కలి వీఆర్వో గాలి రవి, సుధ దంపతులను రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మంగళవారం సత్కరించారు. ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, పాతటెక్కలి మాజీ సర్పంచ్ పిరియా రమణమూర్తి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గాలి షణ్ముఖరావు, ఎంఆర్ఐ డి.పవిత్ర, సర్వేయర్ కె.తిరుపతిరావు, విశ్రాంత ఆర్ఐ గాలి శేషగిరిరావు, వీఆర్వో సంఘం ప్రతినిధులు కె.శ్రావణ్‌కుమార్, వెంకటరావు, కె.ఇందిరా ప్రియదర్శిని, లక్ష్మణరావు ఉన్నారు.

4న విద్యా సంస్థల బంద్



కాశీబుగ్గ: మాట్లాడుతున్న వినోద్

కోటబొమ్మాళి: నీట్ ప్రశ్నాపత్రం లీకేజీని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌కు యాజమాన్యాలు, విద్యార్థులు సహకరించాలని ఎస్‌హెచ్ఆర్ఎస్‌జేసీ శ్రీకాకుళం జిల్లా ముఖ్య కార్యదర్శి తంగుడు మణికంఠ కోరారు. కోటబొమ్మాళిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా తెలివైన, పేద విద్యార్థులు నష్టపోయారన్నారు.

–కాశీబుగ్గ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి మద్దిల వినోద్‌కుమార్ కోరారు. కాశీబుగ్గలో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవికుమార్, విద్యార్థి సంఘ నాయకులు పవన్, తరుణ్, నాని, సాయి, కల్యాణ్ ఉన్నారు.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

టెక్కలి రూరల్: స్థానిక గొల్లవీధి, రామదాసుపేట వీధుల్లో గత మూడు రోజులుగా జరిగిన గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. గొల్లవీధిలోని కిల్లిపోలమ్మ తల్లి ఆలయం నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఘటాలను పట్టుకుని అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి సన్మానం



రమేష్‌ను సత్కరిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: డీఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై విజయవాడ పోలీస్ ప్రధాన కార్యాలయానికి వెళ్తున్న ఏఆర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్) ఆర్ఐ టి.రమేష్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక ఘనంగా సత్కరించారు. క్రమంలో ఎస్పీ ఏపీపీఎస్ లోగోతో కూడిన పోలీస్ క్యాప్, ఆంబ్లమ్ స్టార్స్‌ను రమేష్‌కు అందించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీ ఎల్.శేషాద్రి నాయుడు, ఏవో సీహెచ్ గోపీనాథ్, ఆర్ఐ నర్సింగరావు, పలువురు ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుతో ప్రయోజనం



కంచిలి: అంపురంలో మాట్లాడుతున్న వ్యవసాయధికారి ధనుంజయ



కంచిలి: గొల్లకంచిలి సమావేశంలో అధికారులు, రైతులు



నందిగాం: దిమ్మడిజోలలో కౌలు రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో శ్రీకాంత్‌వర్మ

కంచిలి: కౌలు రైతు కార్డుతో మంచి ప్రయోజనాలున్నాయని కంచిలి తహసీల్దార్ ఎం.వి.కె.ఎస్. రవి, మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ పేర్కొన్నారు. అంపురం, గొల్లకంచిలి గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖలు సంయుక్తంగా కౌలు రైతు గుర్తింపు ప్రక్రియ గురించి సమావేశాలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను ఈ నెల రెండు నుంచి 13వ తేదీ వరకు మండల వ్యాప్తంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీని కోసం గ్రామస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది సంయుక్తంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో స్థానిక రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది , గ్రామ రైతులు పాల్గొన్నారు.

నందిగాం: కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులందరూ గుర్తింపు కార్డులు పొందాలని వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ సూచించారు. దిమ్మిడిజోల, కల్లాడ రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. కౌలురైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సౌకర్యాలు పొందాలంటే కచ్చితంగా గుర్తింపుకార్డులు ఉండాలని దీని కోసం కౌలు సాగు ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని అన్నారు. ప్రభుత్వ పథకాలు, రుణాలు, రాయితీలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.పద్మావతి ఉన్నారు.

మొక్కలు నాటివేత



కాశీబుగ్గ: మొక్క నాటుతున్న దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కాశీబుగ్గ: పలాస మండలం జగన్నాథపురం గ్రామంలో అమ్మకోసం మొక్కనాటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మామిడి ప్రసాదరావు, ట్రెజరర్ ఉమాపతితో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో..

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థిని దున్న అనిత పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



వైద్యులతో కలిసి ఆస్పత్రిని సందర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2018 సంవత్సరంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కిడ్నీ పరిశోధన కేంద్రానికి శంకుస్థాపన చేశారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిడ్నీ ఆస్పత్రిని మాత్రమే నిర్మించారని చెప్పారు. అనంతరం నాలుగో అంతస్తులో ఉన్న జార్జి ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌కు చెందిన పరిశోధనల విభాగాన్ని వైద్య బృందంతో కలిసి పరిశీలించారు. జార్ఖండ్ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులతో సమావేశమై ఇక్కడ రోగులకు అందుతున్న సేవలపై సమీక్షించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, ప్రొఫెసర్ వివేకానంద, డాక్టర్ అనీషా, బీసీ సెల్ అధ్యక్షులు లోడగల కామేశ్వరరావు, నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాసరావు, సప్ప నవీన్, గాలి క్రిష్ణారావు, అంబటి క్రిష్ణమూర్తి, బడ్డ నాగరాజు, డొక్కరి శంకరరావు ఉన్నారు.

జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

శ్రీకాకుకుళం కల్చరల్: శ్రీకాకళంలోని బ్యాంకర్స్ కాలనీ సత్యసాయి సేవా సమితి సాయి బృందావనం ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీ, స్క్రీన్ ప్రింటింగ్‌పై 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మహిళల కోసం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 నుంచి 35 ఏళ్ల వయసు లోపు మహిళలకు శాశ్వత స్వయం ఉపాధి కల్పించే నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వివరాలకు 99480 04156, 94403 98049, 83319 00152 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బూర్జపాడులో విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో ఉపాధ్యాయులు, నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు పంచాయతీ పరిధిలో గల డొంకూరు ఉన్నత పాఠశాల అధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు అవగాహన ర్యాలీని చేపట్టారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వక్తలు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సరోజిని, మాజీ సర్పంచ్ దున్న లోకేశ్వరరావు, జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



బహుమతులతో విద్యార్థులు

సోంపేట: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రాంబుడ్డి గణపతి, అమ్మతన్వి ఫౌండేషన్ వ్యవస్థాపకులు దుప్పట్ల సురేష్ కుమార్ అన్నారు. కొర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, అమ్మతన్వి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వాహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో టెక్కలి, సంతబొమ్మాళి మండలాలకు ఈ నెల నాలుగో తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని డీఈఈ జి.శంకర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని దీనికి వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చాకిపల్లిలో పింఛన్ల పంపిణీ పూర్తి

టెక్కలి: టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీని అధికారులు పూర్తి చేశారు. పింఛన్ డబ్బులు లేవనే కారణంగా గ్రామానికి చెందిన సుమారు 15 మంది లబ్ధిదారులకు మొదటి రోజు పింఛన్ నిలిపివేశారు. దీంతో వారంతా ఆందోళన చెందిన వైనంపై 'సాక్షి' లో కథనం వెలువడిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం వారందరికీ పింఛన్ పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు.

దోమల నియంత్రణ సమష్టి బాధ్యత



ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

కవిటి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నియంత్రించవచ్చునని ఈఓ జీవీ వీరభద్రస్వామి అన్నారు. పారిశుద్ధ్య చర్యల కల్పనలో మేజర్ పంచాయతీ కవిటిలో దోమల నియంత్రణలో భాగంగా ఫాగింగ్ చేశారు.